ఎన్నికల వేళ.. కూలీలు దొరకట్లే

- చేలలోనే తెల్లబంగారం
- ఆందోళనలో రైతులు
- ప్రచారాలకు వెళ్తున్న మహిళలు
- పత్తి ఏరేందుకు మహారాష్ట్ర కూలీలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న పవలే శంకర్ అనే రైతు తానూరు మండలం ఉమ్రి(కే) గ్రామంలో తనకున్న ఏడెకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. చేన్లలో పత్తి పగిలినా కూలీలు దొరకకపోవడంతో ఇప్పటివరకు పత్తి తీయలేదు. దీంతో రోజు రూ.వెయ్యి ఖర్చు చేసి మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకొచ్చి పత్తి ఏరిపిస్తున్నాడు. వారికి కిలోకు రూ.8 చొప్పున ఇచ్చి తీయిస్తున్నాడు. ఓవైపు పత్తికి తెగుళ్లు సోకి దిగుబడి రాని పరిస్థితి ఉంటే.. మరోపక్క కూలీల కొరతతో కష్టాలు తప్పడం లేదని బాధిత రైతు వాపోయాడు.



బోరిగాంలో ఏరకపోవడంతో చేనులోనే పత్తి

తానూరు: పత్తి సాగు చేసిన రైతులను కూలీల కొరత వేధిస్తోంది. ఒకేసారి రైతులు తమ చేన్లలో పత్తి ఏరుతుండటం.. మరోవైపు కొందరు మహిళలు అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండటంతో కూలీలు దొరకడం లేదు. దీంతో ఇతర మండలాలతోపాటు అధికంగా మహారాష్ట్ర నుంచి కూలీలు పత్తి ఏరేందుకు తానూరు మండలానికి వస్తున్నారు. ఈసారి కూలీ ఖర్చులతోపాటు ఇతర పెట్టుబడులు కూడా పెరిగాయి.

జిల్లాలో పత్తి సాగు..

గతేడాది మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు ధర రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు పలికింది. దీంతో ఈసారి ఎక్కువ మంది పత్తి పంటకు సాగుకు ఆసక్తి చూపారు. గతేడాది జిల్లాలో పత్తి పంట లక్షా నలభై వేల ఎకరాల్లో సాగు చేయగా ఈసారి లక్షా అరవై వేల ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

పెరుగుతున్న ఖర్చులు..

ఈసారి పత్తి పంట సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు కూలీ ఖర్చులు, పెట్టుబడులూ పెరిగాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో కొందరు వివిధ రాజకీయ పార్టీలకు మద్దతుగా ప్రచారం చేసేందుకు వెళ్తున్నారు. మరోవైపు ఏకకాలంలో చేన్లలో రైతులు పత్తి ఏరుతున్నారు. దీంతో కూలీలు దొరకడం లేదు. గతేడాది చేనులో కిలో పత్తి తీస్తే రూ.5 నుంచి రూ.6 వరకు చెల్లించేవారు. ఈసారి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కూలీలు కిలో పత్తి తీసినందుకు రూ.8 నుంచి రూ.10వరకు తీసుకుంటున్నారు. సాధారణంగా ఒక్కో కూలీ రోజుకు 50 నుంచి 60 కిలోలకు పైగా పత్తి ఏరుతారని(తీస్తారని) రైతులు పేర్కొంటున్నారు.

మహారాష్ట్ర నుంచి కూలీలు..

తానూరు, కుభీర్, ముధోల్, బాసర, కుంటాల, సారంగపూర్ మండలాలు మహారాష్ట్రకు సరిహద్దు ప్రాతంలో ఉన్నాయి. కూలీ ఎక్కువైనా ఇక్కడి రైతులు మహారాష్ట్రలోని భోకర్, ఉమ్రి, తాంసా ప్రాంతాల నుంచి కూలీలను ఆటోలో రప్పించి పత్తి తీయిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న రైతులు..

ఈసారి సరైన సమయంలో వర్షాలు కురువకపోవడం, విత్తనం మొలకెత్తే దశలో అధిక వర్షాలు పడటంతో మొక్కలు దెబ్బతిన్నాయి. దీనికితోడు తెగుళ్లు సోకడంతో దిగుబడి కూడా తగ్గిపోయింది. మరోవైపు కూలీలు దొరకకపోవడంతో చేన్లలో మొక్కలపైనే పత్తి ఉంటుందని రైతులు వాపోతున్నారు. అధిక కూలీ ఇచ్చేందుకు సిద్ధపడినా కూలీలు దొరకడం లేదని పేర్కొంటున్నారు.

ఎన్నికల ప్రచారంతో..

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పర్వం కొనసాగుతోంది. వివిధ పార్టీల నాయకులు గ్రామాల్లో ప్రచారాలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. మహిళాలు పార్టీ ప్రచారానికి, సమావేశాలకు వెళ్తుండడంతో కూలీల కొరత నెలకొంటుంది. దీంతో పత్తి తీతకు మహారాష్ట్ర నుంచి కూలీలను రప్పిస్తున్నామని స్థానిక రైతులు పేర్కొంటున్నారు.

కూలీలు దొరకడం లేదు



కొన్నేళ్లుగా పత్తి పంట పండించడం గగనమవుతుంది. పెట్టుబడులు పెరుగుతున్నా.. దిగుబడులు తగ్గుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో పత్తి తీసేందుకు స్థానిక కూలీలు దొరకడం లేదు. దీంతో సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి కూలీలకు తీసుకొచ్చి పత్తిని ఏరిపిస్తున్నాం.

– బోడ్డోల్ల పోతన్న, బోరిగాం

పొదుపు అలవాటు చేసుకోవాలి

కడెం: ప్రతి ఒక్కరూ తమ ఆదాయంలో కొంత పొదుపు చేయడం అలవాటు చేసుకోవాల ని తెలంగాణ గ్రామీణ బ్యాంకు కడెం శాఖ మేనేజర్ అంజచారి అన్నారు. మండలంలోని కొలాంగూడలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత, సాంకేతికతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలను సద్వి నియో గం చేసుకోవడంతోపాటు బీమా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి ప్రమోద్, రాజు, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

సోన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం అదే పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఉల్లెంగల గజ్జారాం, కోట రమేశ్, మెరుగు శ్రీనివాస్‌రెడ్డి, తొడిశెట్టి రవికాంత్, కొండూరు పోతన్నను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ టి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని.. వారే దేశాభివృద్ధికి కారణమని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు కె.ఆరాధన, మురళీధర్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి



సూచనలు చేస్తున్న ఏసీజీఈ పద్మ

మామడ: విద్యార్థులు ప్రణాళిక ఏర్పాటు చేసుకొని చదవితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఏసీజీఈ సిద్ద పద్మ అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీని సందర్శించారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసి మెనూ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ జ్యోతి ఉన్నారు.

పాఠశాలలో బాలల దినోత్సవం



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు

మామడ: మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక, ఫ్యాన్సీడ్రెస్‌షో, ఫ్యాషన్ షో కార్యక్రమాలు ఏర్పాటు చేయగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మైస అరవింద్‌కుమార్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఐకేరెడ్డిని గెలిపించాలి'



రాచాపూర్‌లో ప్రచారం చేస్తున్న నేతలు

లక్ష్మణచాంద: చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు నిర్మల్ ఎమ్మెల్యేగా ఐకేరెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం మండలంలోని రాచాపూర్‌లో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు గంగారాం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు పోరాడుదాం



నినాదాలు చేస్తున్న నాయకులు

కుంటాల: భూమి కోసం, భుక్తి కోసం అసువులు బాసిన అమరుల ఆశయ సాధన కోసం పోరాడుదామని సీపీఐ(యంఎల్ ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి కె.రాజన్న పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూర్ గ్రామంలో నిర్వహించిన అమరవీరుల వర్ధంతి సభలో మాట్లాడారు. దేశంలో ఇప్పటికీ నిజమైన స్వాతంత్రం రాలేదని, పేద ప్రజలు అనేక దోపిడీలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, కార్యదర్శి రామలక్ష్మణ్, నాయకులు ముక్తార్, మచ్చేందర్, లక్ష్మి, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో 'అల్లోల' హుషారు



జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో నిర్మల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా ఓ ఇస్త్రీషాపులో ఇస్త్రీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఓ 90 ఏళ్ల వృద్ధురాలు నువ్వు సల్లంగా ఉండి మళ్లీ గెలవాలని మంత్రిని దీవించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సామాన్యుడి ఆయుధం ఓటుహక్కు

తానూరు: సామాన్యుడి ఆయుధమైన ఓటుహక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో మోహన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. యువత పోలింగ్ శాతం పెంచేందుకు ప్రజలకు చైతన్యవంతుల్ని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి జాలం సింగ్, ఉపాధిహామీ టీఏ రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, చింతల్‌చాంద, మునిపెల్లి గ్రామాల్లో శుక్రవారం ఓటుహక్కుపై ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఓటుహక్కు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధమని.. ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.



తానూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు



సర్సాపూర్(జ)లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో 'సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం'(స్వీప్)పై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండినవారంతా ఓటు హక్కు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీడీఓ అల్లాడి వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఖానాపూర్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎన్నికల్లో వినియోగించుకోవాలని బీఎల్‌వో వరలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శివాజీనగర్, శాంతినగర్‌కాలనీల్లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకొని ఎన్నికల్లో 100శాతం పోలింగ్ నమోదయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, మెప్మా సిబ్బంది తదితరులు ఉన్నారు.

'గిరిజనులను మోసం చేస్తున్న ప్రభుత్వం'



మాట్లాడుతున్న రాజేశ్‌బాబు

ముధోల్: గిరిజనులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు అన్నారు. మండలంలోని విఠోలితండాలో శుక్రవారం ఏర్పాటు చేసిన గిరిజనుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ముధోల్ నియోజకవర్గంలో గిరిజన ప్రాంతాలకు మంజూరైన రోడ్ల నిధులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దారి మళ్లిస్తున్నారని అన్నారు. పోడు భూముల విషయంలో గిరిజనులకు అన్యాయం జరిగిందని.. అనర్హులకు పట్టాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భైంసా మండలం రంగరి గుడిసెలకు గిరిజన నిధుల మంజూరు చేయడం సరికాదన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని.. ఎడ్‌బిడ్ తండా సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద చర్చలకు సిద్ధమని ప్రకటించారు. విఠోలితండా సర్పంచ్ విజేశ్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

దండారీ ఉత్సవాల్లో జాన్సన్‌నాయక్



ఉత్సవాల్లో నృత్యం చేస్తున్న జాన్సన్‌నాయక్



ఖానాపూర్: పార్టీలో చేరిన వారితో జాన్సన్

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ మండలంలోని హీరాపూర్(జే), కొలాంగూడ, మత్తడిగూడ, కన్నాపూర్ గ్రామాల్లో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. దండారీ సభ్యులతో కలిసి కోలాటం ఆడారు. దండారీ ఉత్సవాలకు సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేస్తున్నారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి..

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ గెలిపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని నీటి పారుదల శాఖ చైర్మన్ వేణుగోపాల్‌చారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యకక్రమంలో ఎంపీపీ పోటే శోభా సాయినాథ్, బీఆర్ఎస్ నాయకులు పుర్ణచందర్ నాయక్, కనక తుకారం, పెందోర్ ప్రభాకర్, పెందోర్ పుష్పరాణ పాల్గొన్నారు.

జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలి

ఖానాపూర్: ప్రజల సమస్యలు తెలిసిన జాన్సన్ నాయక్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమాల్లో గోపాల్, వాల్‌సింగ్, వెంకటేశ్వర్, రవీందర్, తిరుపతి, అశోక్, ప్రసాద్, నవీన్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం

ఖానాపూర్: సీఎం కేసీఆర్ పాలనలోనే అన్నివర్గాలకు న్యాయం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని కరీంకాలనీలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీలోని ఫైసల్, వాసేఖాన్, ఉస్మాన్, వాహబ్, ఆమెర్, సద్దాం, సోను, సోయబ్, సన్న, సలీం, ముసదిక్, ఉమేర్, ఫేరోజ్, వాహబ్, రహిల్, జలీల్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పరిమి సురేశ్, ఖలీల్, శ్రీనివాస్, ఇర్ఫాన్, షోయబ్, కిశోర్, సత్యనారాయణ, సంతోశ్, మెహరాజ్, నశీర్ తదితరులున్నారు.

కత్తెరపురుగుతో జాగ్రత్తగా ఉండాలి

నర్సాపూర్(జి): మొక్కజొన్న పంటను ఆశిస్తున్న కత్తెర పురుగుతో రైతులు జాగ్రత్తగా ఉండాలని ఏవో జాదవ్ సాయికిరణ్, ఏఈవో రమ్య అన్నారు. శుక్రవారం మండలంలోని నందన్ గ్రామంలో మొక్కజొన్న పంటలను వారు పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు ప్రాథమిక దశలోనే వేపనూనె పిచికారీ చేయాలన్నారు. 15 నుంచి 20 రోజుల పంటలో పురుగు గమనిస్తే ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములను లీటర్ నీటికి వేపనూనె కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు సాయన్న, భోజన్న, దేవేందర్ పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

సోన్: వేరుశనగ పంటలో తెగుళ్ల నివారణకు అన్నదాతలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో వినోద్ అన్నారు. శుక్రవారం మండలంలోని న్యూబొప్పారం, వెల్మల్ గ్రామాల్లో వేరుశనగ పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రసం పీల్చే తెగుళ్ల నివారణకు ఇమిడక్లోప్రైడ్ ఎకరాకు 100 మి.లీ.. లద్దె పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములను ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. విషపు ఎర కోసం వరితవుడు ఐదుకిలోలు, బెల్లం అరకేజీ రోజంతా నానబెట్టి దానికి మోనాక్రోటోపాస్ 500 మి.లీ కలిపి ఎకరంలో సాయంత్రం చల్లి పురుగు ఉధృతిని నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు అంబాజీ, రజనీ రైతులు పాల్గొన్నారు.



నందన్‌లో పంట పరిశీలిస్తున్న ఏవో సాయికిరణ్



న్యూబొప్పారంలో పంట పరిశీలిస్తున్న ఏవో వినోద్

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

కుంటాల: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించుకోవాలని పీఏసీఎస్ కార్యదర్శి నాగభూషణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, భోజేందర్, మహేశ్, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మునిపెల్లిలో..

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో పవిత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలోనే రైతులు తమ పంటను చుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. ఇందులో వీడీసీ నాయకులు రమేశ్, లింగారెడ్డి, భూమేశ్ తదితరులు ఉన్నారు.



కల్లూర్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న సిబ్బంది



మునిపెల్లిలో ప్రారంభిస్తున్న ఏఈవో పవిత్ర

పటిష్ట బందోబస్తు



బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్



నామినేషన్ సెంటర్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలను అదుపు చేస్తున్న పోలీసులు

అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ దాఖలుకు చివరిరోజు కావడంతో జిల్లా కేంద్రంలో నామినేషన్ కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావు, నిర్మల్ బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ వేశారు. దీంతో ఇరు పార్టీల అభ్యర్థులు తమ మద్దతుదారులతో భారీ ర్యాలీ నిర్వహించడంతో రోడ్లు కిక్కిరిసి పోయాయి. ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తకుండా పోలీసులు అన్ని చర్యలు తీసుకున్నారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పర్యవేక్షణలో సీఐలు, ఏస్సైలు, కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

'ఏలేటి'కి మద్దతుగా బైక్ ర్యాలీ



లక్ష్మణచాంద నుంచి నిర్మల్‌కు వెళ్తున్న బీజేపీ నాయకులు

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలో బీజేపీ నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేయగా.. ఆయనకు మద్దతు తెలిపేందుకు మండల కేంద్రం నుంచి భారీగా ఆ పార్టీ కార్యకర్తలు, ప్రజలు బైక్‌లపై ర్యాలీగా తరలివెళ్లారు. ఎంపీపీ అడ్వాల పద్మ, సర్పంచ్ ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్‌కు ర్యాలీ తీశారు. అడ్వాల రమేశ్, ఎంపీటీసీ నర్సారెడ్డి, గోవర్ధన్, రంజిత్ పాల్గొన్నారు.

14 నుంచి కొనుగోళ్లు

ఇంద్రవెల్లి: మండలంలోని విజయలక్ష్మీ, ఐఎఫ్‌పీసీఎల్, మిథల్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ వెంట ఆధార్ తెచ్చుకోవాలని వారు పేర్కొన్నారు.